సాక్షి జనగామ

మంగళవారం | 19 | నవంబర్ | 2024



రైల్వే డివిజన్‌కు అడుగులు..

కాజీపేట జంక్షన్ రైల్వే డివిజన్ ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. సికింద్రాబాద్ రైల్వే అధికారులకు సోమవారం రాత్రి సమాచారం అందినట్లు తెలిసింది. - 8లో ▸



మార్కెట్‌కు కొత్త మిర్చి..

వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం ఈసీజన్‌లో కొత్త మిర్చి తేజ రకం పంటను రైతులు విక్రయానికి తీసుకొచ్చారు. - 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
$30^0/16^0$

వాతావరణం

ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం అక్కడక్కడా మేఘావృతమై మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి పూట చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు : కలెక్టర్



తరిగొప్పుల: కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలి.. ధాన్యం తీసుకు వచ్చిన రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. అబ్దుల్ నాగారంలో ఐకేపీ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సోమవారం తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించారు. తహసీల్దార్ నాగేశ్వరాచారి, ఎంపీడీఓ ఆలేటి దేవేందర్‌రెడ్డి, ఏఓ పెచెట్టి మనోహిత్ విక్రమరావ్, ఏఈఓ విమల, పంచాయతీ కార్యదర్శి కంకటి రవీందర్ గౌడ్ పాల్గొన్నారు.

రికార్డుల నమోదు తప్పనిసరి..



లింగాలఘణపురం: ఆశ వర్కర్ల దినచర్యలపై ఇకనుంచి రికార్డుల నమోదు తప్పనిసరిగా ఉండాలి.. లేదంటే చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ మల్లికార్జున్‌రావు అన్నారు. సోమవారం స్థానిక పీహెచ్‌సీలో ఆశ కార్యకర్తల దినచర్యల రికార్డు రిజిస్టర్లను అందజేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రవితేజ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. ఆశ కార్యకర్తలు రోజువారీగా నిర్వహించే ఇమ్యూనైజేషన్, టీబీ, వాక్సినేషన్, గర్భిణుల పరీక్షలు తదితర వివరాలను రికార్డులో నమోదు చేసి.. ఏఎన్‌ఎం లేదా స్థానిక వైద్య సిబ్బందితో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. వైద్యులు సుస్మిత, హారిక, సూపర్‌వైజర్లు భాగ్య, సుజాత, శివాజీ పాల్గొన్నారు.

ట్రెక్కింగ్ క్యాంపునకు ఛాగల్లు విద్యార్థులు



స్టేషన్‌ఘన్‌పూర్: మహారాష్ట్ర కొల్హాపూర్‌లో ఈనెల 20 నుంచి జరిగే ఆల్ ఇండియా ట్రెక్కింగ్ క్యాంపునకు ఛాగల్లు జెడ్పీఎస్‌ఎస్‌కు చెందిన ఎన్‌సీసీ విద్యార్థులు గాండ్ల శ్రీగణేష్, మేకల నాగరాజు, రంగు శ్రీచరణ్(పదవ తరగతి), మహమ్మద్ రియాజ్(9వ తరగతి) ఎంపికైనట్లు హెచ్‌ఎం కొమురయ్య తెలిపారు. పాఠశాలలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ట్రెక్కింగ్ క్యాంపునకు తెలంగాణ నుంచి తమ పాఠశాల కేడెట్లు ఎంపిక కావడం సంతోషంగా ఉందంటూ.. ఇందుకు కృషి చేసిన అసోసియేట్ ఎన్‌సీసీ అధికారి రుద్రారపు శాంతిని అభినందించారు. కార్యక్రమంలో కొల్లూరు ప్రకాశం, అంజిరెడ్డి, రాజేంద్రప్రసాద్, పరమేశ్వరి, రంజిత్‌కుమార్, శ్రీనివాస్, వెంకటేష్, విజయకుమారి, లలితకుమారి, దేవేందర్‌కౌర్, సోమరాజు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అవసరం



జనగామ: జ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు ప్రతీ ఒక్కరికి పుస్తక పఠనం అవసరమని జిల్లా విద్యాశాఖ అధికారి రాము అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం జిల్లా గ్రంథాలయంలో నిర్వహించిన వేడుకల్లో డీఈఓ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అంతకు ముందు పుల్లయ్య కళానిలయం కార్యదర్శి మసురం రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యాన విద్యార్థులకు చిత్ర కళా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గుర్రం భూలక్ష్మి నాగరాజు, లైబ్రేరియన్లు రామచందర్ నాయక్, కృష్ణ, పుస్తక ప్రేమికులు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలకు రూ.180 కోట్ల నిధులు

వరంగల్ అర్బన్: ఉమ్మడి జిల్లాలో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం రూ.180.80 కోట్ల నిధులు మంజూరు చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. వరంగల్ నగరంలో ఐదు రోడ్ల విస్తరణ, అభివృద్ధికి రూ.49.50 కోట్లు, హనుమకొండ జిల్లా పరకాల డివిజన్ కేంద్రం నుంచి ఎర్రగట్టు గుట్ట వరకు రోడ్డు విస్తరణ, అభివృద్ధికి రూ.65 కోట్లు, మహబూబాబాద్ జిల్లా గూడూరు నుంచి కేసముద్రం వరకు రోడ్డు విస్తరణ, అభివృద్ధికి రూ.40 కోట్లు మంజూరు చేసింది. స్టేషన్‌ఘన్‌పూర్ ఇంటిగ్రేటెడ్ డివిజన్ భవన నిర్మాణానికి రూ.26 కోట్లు మంజూరయ్యాయి.

‘ప్రజా విజయోత్సవ’ శోభ

నేడు వరంగల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి

- ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో బహిరంగ సభ
- హాజరుకానున్న లక్ష మంది మహిళలు
- ముస్తాబైన 'ఇందిరా మహిళా శక్తి ప్రాంగణం'
- ప్రారంభోత్సవానికి సిద్ధమైన కాళోజీ కళాక్షేత్రం
- విజయోత్సవ సభను సక్సెస్ చేయండి : మంత్రులు, ఎమ్మెల్యేలు

సాక్షిప్రతినిధి, వరంగల్ :



రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పర్యటన కోసం వరంగల్ ముస్తాబైంది. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్న సందర్భంగా నిర్వహిస్తున్న తొలి సభ కోసం హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానం(ఇందిరా మహిళా శక్తి ప్రాంగణం) సిద్ధమైంది. లక్ష మంది మహిళలను తరలించి పెద్ద ఎత్తున నిర్వహించే ఈ సభ కోసం నాలుగు రోజులుగా విస్తృతంగా ఏర్పాట్లు జరిగాయి. టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు డి.శ్రీధర్ బాబు, కొండా సురేఖ, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సభను విజయవంతం చేసేందుకు జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు ఇప్పటికే ఐదారుసార్లు సమావేశమై వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. మరోవైపు అధికారికంగా నిర్వహించే ఈ సభా ఏర్పాట్లను హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, డాక్టర్ సత్యశారద, పోలీసు కమిషనర్ అంబర్‌కిషోర్ ఝా, ఇతర అధికారులు పర్యవేక్షించారు. కాగా ఓరుగల్లు కేంద్రంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన విజయోత్సవ సభ సక్సెస్‌ను అందరూ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ఇదిలా ఉండగా ప్రజాపాలన–ప్రజావిజయోత్సవాల్లో భాగంగా మంగళవారం వరంగల్‌లో నిర్వహించే ఈ వేడుకల్లో పాల్గొనేందుకు సీఎం రేవంత్‌రెడ్డి మధ్యాహ్నం 2:30 గంటలకు హనుమకొండ 'కుడా' గ్రౌండ్స్‌లోని హెలిపాడ్‌కు చేరుకుంటారు.

118 మంది అధికారుల పర్యవేక్షణ


హన్మకొండ అర్బన్ : సీఎం పర్యటన నేపథ్యంలో వివిధ శాఖల అధ్వర్యాన చేపట్టిన ఏర్పాట్లను 118 మంది జిల్లా అధికారులు పర్యవేక్షించారు. పోలీస్ శాఖ అధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. సభ నిర్వహణలో 1,428 మంది అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తించనున్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యాన మెడికల్ క్యాంపులు(7), ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు(6), అధికారులు, సిబ్బంది(75), స్పెషలిస్ట్ డాక్టర్లు(10), అంబులెన్స్‌లు(05) ఏర్పాటు చేసినట్లు డీఎంహెచ్‌ఓ అప్పయ్య తెలిపారు.

నగరానికి శోభ

వరంగల్ అర్బన్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో వరంగల్ నగరాన్ని ముస్తాబు చేశారు. జిల్లా స్థాయి అధికారులతోపాటు బల్దియాలోని అన్ని విభాగాల అధికారులు ఈ పనుల్లో నిమగ్నమయ్యారు. సీఎం పర్యటించే ప్రాంతాలను సుందరంగా తీర్చిదిద్దారు. వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రధాన రహదారుల్లోని డివైడర్లకు రంగులు వేశారు. హరితహారాన్ని ప్రతిబింబించే నినాదాలు, చిత్రాలను వివిధ ప్రభుత్వ కార్యాలయాల గోడలపై రాయించారు. ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు, లాలీపాప్స్‌పై ఫ్లెక్సీలు ఆకట్టుకుంటున్నాయి. రహదారుల గుంతల్లో బీటీ వేశారు. ట్రీ గార్డులు, పూల మొక్కలు ఏర్పాటు చేశారు. హనుమకొండ ఆర్టీసీ బస్‌స్టేషన్ నుంచి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వరకు పచ్చదనం, పరిశుభ్రతతో కళకళలాడుతోంది.

సీఎం సభకు 890 ఆర్టీసీ బస్సులు

హన్మకొండ: ప్రజాపాలన విజయోత్సవ సభకు ప్రజలను సమీకరించడానికి ఆర్టీసీ 890 బస్సులను కేటాయించింది. వరంగల్ రీజియన్‌కు చెందిన 518 బస్సులు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆయా ప్రాంతాలకు కేటాయించారు. మిగతా బస్సుల్లో ఖమ్మం, కరీంనగర్, నల్లగొండ, మెదక్ జిల్లాలనుంచి సభకు తరలిరానున్నారు. మహిళలతో పాటు ఇతర వర్గాల ప్రజలు కూడా భారీగా తరలివచ్చేలా కాంగ్రెస్ నాయకులు ఏర్పాట్లు చేశారు.



ఆర్ట్స్ కాలేజీ మైదానం సభా ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లు





సభా వేదిక

సభను విజయవంతం చేయండి : మంత్రి, ఎమ్మెల్యేలు

ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల గ్రౌండ్స్(ఇందిర మహిళాశక్తి ప్రాంగణం)లో మంగళవారం నిర్వహించే ప్రజాపాలన విజయోత్సవ సభను విజయవంతం చేయాలని మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆర్ట్స్ కాలేజీ మైదానాన్ని సందర్శించారు. సభా వేదికను పరిశీలించారు. సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనే ఈ సభకు అధిక సంఖ్యలో మహిళలు, ప్రజలు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

సీఎం టూర్ షెడ్యూల్ ..

మధ్యాహ్నం 2.30 గంటలకు హెలికాప్టర్ ద్వారా 'కుడా' మైదానానికి చేరుకుంటారు

- 2.30 : కాళోజీ కళాక్షేత్రం ప్రారంభిస్తారు
- 3.10 : ఆర్ట్స్ కాలేజీ మైదానానికి బయలుదేరుతారు
- 3.20 : ఆర్ట్స్ కాలేజీ మైదానంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలిస్తారు
- 3.50 : జ్యోతి ప్రజ్వలన, రాష్ట్రీయ గీతాలాపన
- 3.55 : సీఎస్ శాంతికుమారి చే స్వాగతోపన్యాసం
- 4.00 : మంత్రుల ప్రసంగం
- 4.20 : 22 ఇందిరా మహిళా శక్తి భవనాలు, ట్రాన్స్‌జెండర్ క్లినిక్స్‌కు శంకుస్థాపనలు, ఇందిరా మహిళా శక్తి ద్వారా వివిధ కార్యక్రమాల ప్రారంభోత్సవం, లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ, డిస్కం, ఆర్టీసీల ఎంఓయూల అందజేత
- 4.30 : ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రసంగం
- 4.40 : సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగం

సాయంత్రం 5.00 గంటలకు హనుమకొండ కలెక్టర్ కృతజ్ఞత ప్రసంగం

నేడు నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు

- సీఎం పర్యటన నేపథ్యంలో వాహనాల మళ్లింపు



సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం: సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ పర్యటన సందర్భంగా మంగళవారం వరంగల్, హనుమకొండ, కాజీపేట నగరాల్లో ట్రాఫిక్ మళ్లింపుతో పాటు ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. హైదరాబాద్, ఖమ్మం, హుజూరాబాద్, ములుగు ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులు నిర్దేశించిన మార్గాల్లో ప్రయాణించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ట్రాఫిక్ మళ్లింపు, ఆంక్షలు ఉదయం 9 గంటల నుంచి బహిరంగ సభ ముగిసే వరకు కొనసాగుతాయని, ట్రైసిటీ పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలు ఉన్నందున అవసరం ఉంటే తప్ప వాహనాల్ని బయటకు తీయొద్దని, భారీ వాహనాలకు ప్రవేశం లేదని తెలిపారు.

మళ్లింపు ఇలా..

- హుజూరాబాద్ నుంచి హైదరాబాద్, ఖమ్మం ప్రాంతాలకు వెళ్లే వాహనాలు చింతగట్టు ఓఆర్ఆర్, కరుణాపురం మీదుగా హైదరాబాద్‌కు వెళ్లాల్సి ఉంటుంది. కరుణాపురం, ఐనవోలు, పున్నేలు మీదుగా ఖమ్మం వెళ్లాలి.
- పరకాల, ములుగు మార్గాల నుంచి హైదరాబాద్, ఖమ్మం, కరీంనగర్ ప్రాంతాలకు వెళ్లే వాహనాలు ఓఆర్ఆర్, కరుణాపురం మీదుగా హైదరాబాద్‌కు వెళ్లాల్సి ఉంటుంది. కరుణాపురం ఐనవోలు, పున్నేలు మీదుగా ఖమ్మంకు వెళ్లాల్సి ఉంటుంది.
- వర్ధన్నపేట వైపు నుంచి హైదరాబాద్, కరీంనగర్, ములుగు, పరకాల, భూపాలపల్లి వెళ్లే వాహనాలు పున్నేలు క్రాస్ నుంచి డైవర్షన్ తీసుకుని ఐనవోలు, కరుణాపురం ఓఆర్ఆర్ మీదుగా వెళ్లాలి.

సభాస్థలికి వెళ్లేందుకు..

హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరిగే బహిరంగ సభకు వచ్చే వాహనాలు ఈ మార్గాల మీదుగా రావాల్సి ఉంటుంది.

- హుజూరాబాద్ వైపు నుంచి వచ్చే వాహనాలు చింతగట్టు వద్ద ఓఆర్ఆర్ పైకి ఎక్కి ఉనికిచర్ల క్రాస్ రోడ్, వడ్డేపల్లి చర్చి, రిజిస్ట్రేషన్ కార్యాలయం, తెలంగాణ జంక్షన్ వడ్డేపల్లి రోడ్ నుంచి సర్క్యూట్ గెస్ట్‌హౌస్ వద్ద ప్రజలను దింపి ఖాళీ వాహనాలను ఓల్డ్ బస్‌డిపో వద్ద పార్క్ చేయాలి.
- హనుమకొండ, ములుగు, భూపాలపల్లి నుంచి వచ్చే వాహనాలు పెద్దమ్మగడ్డ డైవర్షన్ నుంచి కేయూసీ జంక్షన్, 100 ఫీట్ల రోడ్ మీదుగా గోపాలపూర్ జంక్షన్, తిరుమల జంక్షన్ ఎక్సైజ్ కాలనీ ఐలాండ్ వద్ద దించి ఖాళీ వాహనాలను ఎక్సైజ్ కాలనీ–1లో పార్కింగ్ చేయాలి.
- నర్సంపేట వైపు నుంచి వచ్చే వాహనాలు చింతల్ బ్రిడ్జ్, హంటర్ రోడ్ మీదుగా నీలిమా జంక్షన్, తెలంగాణ జంక్షన్ వద్ద దింపి వాహనాలను సూచించిన ప్రదేశంలో పార్కింగ్ చేయాలి.
- మామునూరు నుంచి వచ్చే వాహనాలు ఆర్టీఓ జంక్షన్, ఉర్సు గుట్ట మీదుగా హంటర్ రోడ్ నీలిమా జంక్షన్, తెలంగాణ జంక్షన్ వద్ద దించి ఖాళీ వాహనాలను విష్ణుప్రియ గార్డెన్స్‌లో పార్కింగ్ చేయాలి.
- స్టేషన్‌ఘన్‌పూర్ వైపు నుంచి వచ్చే వాహనాలు ఉనికిచర్ల ఎక్స్ రోడ్, వడ్డేపల్లి చర్చి, ప్రశాంతినగర్ పార్క్ తెలంగాణ జంక్షన్ మీదుగా జనాలను దించి ఖాళీ వాహనాలను తెలంగాణ జంక్షన్ వద్ద పార్కింగ్ చేయాల్సి ఉంటుంది.

రైతుల సంక్షేమానికి పెద్దపీట

- ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

జఫర్‌గఢ్: రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూ రైతుల సంక్షేమానికి అనేక విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు వెళ్తోందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో డబ్బులతో పాటు సన్నరకాలకు రూ.500 బోనస్ జమకావడాన్ని హర్షిస్తూ సోమవారం 'రైతు సంబరాలు' నిర్వహించారు.

సింగిల్ విండో చైర్మన్ తీగల కర్ణాకర్‌రావు అధ్యక్షతన జరిగి ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియంతోపాటు టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలో 270 మంది రైతులకు రూ.56 లక్షలు వారి ఖాతాల్లో జమైనట్లు చెప్పారు. ఇప్పటికైనా ప్రతిపక్షాలు అడ్డగోలు మిర్యలు చేయకుండా ఆలోచన చేయాలని హితవు పలికారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్‌రెడ్డి, వైస్ చైర్మన్ నూకల ఐలయ్య, సొసైటీ వైస్ చైర్మన్ మొగిళిపాక నర్సింగం, డైరెక్టర్లు ఇల్లందుల బాబు, అయేషాబేగం, భూక్య సురేష్, మార్కెట్ మాజీ చైర్మన్లు అన్నం బ్రహ్మారెడ్డి, అన్నెబోయిన భిక్షపతి, గుజ్జరి రాజు తదితరులు పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కడియం, పక్కన మార్నేని, తదితరులు

ముగిసిన గ్రూప్–3 పరీక్షలు

- 56.55శాతం అభ్యర్థుల హాజరు

జనగామ: జిల్లాలో గ్రూప్–3 పరీక్షలు సోమవారం ముగిసాయి. రెండు రోజుల పాటు జరిగిన మూడు పేపర్ల పరీక్షలకు 43 శాతానికి పైగా అభ్యర్థులు దూరంగా ఉన్నారు. జిల్లా కేంద్రంలో 16 సెంటర్లను 5,446 మంది పరీక్ష రాయడానికి కేటాయించారు. చివరి రోజు 3వ పేపర్‌కు 3,080 మంది హాజరయ్యారు. ఓవరాల్‌గా 56.55 శాతం హాజరు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. అభ్యర్థులు రాసిన పరీక్ష పత్రాలను పోలీసు బందోబస్తు నడుమ కలెక్టరేట్‌లోని స్ట్రాంగ్‌రూం నుంచి అదనపు కలెక్టర్(ఏసీ) పింకేష్‌కుమార్ ఆధ్వర్యాన హైదరాబాద్ టీజీపీఎస్సీ కార్యాలయానికి తరలించారు.

సెంటర్లను తనిఖీ చేసిన కలెక్టర్

జిల్లా కేంద్రం ధర్మకంచ ప్రభుత్వ జూనియర్ కళాశాల, నెహ్రూ పార్క్ ఏరియాలోని సెయింట్‌పాల్స్ హైస్కూల్ పరీక్ష కేంద్రాలను కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆకస్మికంగా తనిఖీ చేశారు. అభ్యర్థుల హాజరు, బయోమెట్రిక్, సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యార్థులు పరీక్ష ఎలా రాస్తున్నారనే దానిపై ప్రత్యక్షంగా పరిశీలించారు. ఆయన వెంట ఆర్డీఓ గోపీరామ్, హౌసింగ్ ఈఈ దామోదర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవీలత, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.పావనికుమారి, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ మన్యం కొండ, పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ దేవకుమార్ తదితరులు ఉన్నారు.



సెయింట్‌పాల్స్ హైస్కూల్ సెంటర్‌లో గ్రూప్–3 పరీక్ష తీరును పరిశీలిస్తున్న కలెక్టర్

జోనల్ క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

పాలకుర్తి టౌన్: పదో జోనల్ మీట్ క్రీడల్లో పాలకుర్తి తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి పతకాలను సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎస్.స్వరూప తెలిపారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనెల 11 నుంచి 14వ తేదీ వరకు సూర్యాపేట జిల్లా నడిగూడెంలో జరిగిన పదో జోనల్ మీట్‌లో విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చినట్లు చెప్పారు. పీఈటీ స్వప్న, ఉపాధ్యాయులను అభినందించారు.



సాధించిన పతకాలతో విద్యార్థులు

చివరి దశకు కుటుంబ సర్వే

- 1,83,724 కుటుంబాలకు 1.35 లక్షలు పూర్తి..
- హైదరాబాద్‌లో ముగిసిన మాస్టర్ ట్రెయినర్ల శిక్షణ
- కొనసాగుతున్న డాటా ఎంట్రీ ఆపరేటర్ల తాత్కాలిక రిక్రూట్‌మెంట్

జనగామ: తెలంగాణ ప్రభుత్వం తలపెట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర సర్వే చివరి దశకు చేరుకుంది. కలెక్టర్ రిజ్వాన్ బాషా పర్యవేక్షణలో అదనపు కలెక్టర్లు పింకేష్‌కుమార్, రోహిత్‌సింగ్ ఆధ్వర్యాన జిల్లా వ్యాప్తంగా సర్వే ముమ్మరంగా సాగుతోంది. ఈనెల 9న ప్రారంభమైన సర్వే.. మరో వారం రోజుల్లో వంద శాతం లక్ష్యం చేరుకోనుంది. సర్వే పూర్తయిన వెంటనే కుటుంబాల వారీగా వివరాలను డాటా ఎంట్రీ చేసేందుకు సిద్ధం చేస్తున్నారు.

మరో 48 వేల కుటుంబాలు..

జిల్లాలో మొత్తం 1,83,724 కుటుంబాలు ఉండగా ఇప్పటి వరకు 1,35,282 కుటుంబాల సర్వే పూర్తయింది. మరో వారం రోజుల్లో నూరుశాతం లక్ష్యం చేరుకోనుంది. జనగామ మున్సిపల్ పరిధిలో 15,433 గృహాలకు 11,205, రూరల్‌లో 1,68,291 కుటుంబాలకు 1,24,077 కుటుంబాల సభ్యులు సర్వేలో పాల్గొన్నారు. ఇంకా 48,442 కుటుంబాల సర్వే మిగిలి ఉంది. ఎన్యుమరేటర్లలో చాలా మంది ఉదయం 8 గంటల వరకే సర్వే మొదలు పెడుతుండగా.. ప్రభుత్వ టీచర్లు మధ్యాహ్న సమయంలో పని చేస్తున్నారు. ఇదిలా ఉండగా జనగామ బాలాజీనగర్‌తో పాటు మండలాల పరిధి పలు గ్రామాల్లో ఇప్పటి వరకూ ఇంటింటా స్టిక్కరింగ్ వేయలేదనే ఆరోపణలున్నాయి.

డాటా ఎంట్రీకి సిద్ధం...

సర్వే పూర్తయిన వెంటనే వివరాలను డాటా ఎంట్రీతో ఆన్‌లైన్ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి జిల్లా ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్ గౌతమ్‌రెడ్డితో పాటు ఏడుగురు మాస్టర్ ట్రెయినర్లకు ఇటీవల హైదరాబాద్‌లో శిక్షణ ఇచ్చారు. జిల్లా కేంద్రం అర్బన్, జనగామ మండలం, లింగాలఘణపురం, బచ్చన్నపేట, నర్మెట, తరిగొప్పుల, దేవరుప్పుల, స్టేషన్‌ఘన్‌పూర్, జఫర్‌గఢ్, చిల్పూరు, రఘునాథపల్లి, పాలకుర్తి, కొడకండ్ల మండలాలకు సంబంధించిన సర్వే డాటాను ఆన్‌లైన్ చేయనున్నారు. ఇందుకు 300 మంది ఆపరేటర్లను తాత్కాలికంగా రిక్రూట్ చేసుకుంటున్నారు. మాస్టర్ ట్రెయినర్లు వీరికి జిల్లా స్థాయిలో శిక్షణ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు.



సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్

విజయవంతంగా సర్వే..



జిల్లాలో కుటుంబ సమగ్ర కుల గణన సర్వే విజయవంతంగా సాగుతోంది. జనగామ అర్బన్‌తో పాటు 12 మండలాల పరిధిలో మిగిలి కుటుంబాల సర్వే త్వరలోనే పూర్తి కానుంది. సర్వే పూర్తయిన వెంటనే ఇంటింటా సేకరించిన వివరాలను డాటా ఎంట్రీ ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభిస్తాం. సర్వే సమయంలో ఎక్కడా పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నాం. రోజువారీగా సర్వేపై దృష్టి పెట్టాం.

– రిజ్వాన్ బాషా, కలెక్టర్

శ్రీసోమేశ్వరాలయంలో లక్ష దీపోత్సవం



లక్ష దీపోత్సవంలో పాల్గొన్న మహిళలు

పాలకుర్తి టౌన్: శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. స్వామివారిని దర్శించుకుని అభిషేక అర్చనలు చేశారు. కార్తీక మాసోత్సవాల్లో భాగంగా సాయంత్రం నిర్వహించిన లక్ష దీపోత్సవంలో మహిళలు అధికంగా పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఈఓ మోహన్‌బాబు, ఆలయ సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య, అర్చకులు డీవీఆర్.శర్మ, దేవగిరి అనిల్‌కుమార్, నాగరాజు, సంతోష్, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు దేవస్థాన కమిటీ నియామకం

- జీడికల్ చైర్మన్‌గా ఏలె మూర్తి ఎన్నిక

సాక్షి ఎఫెక్ట్..

లింగాలఘణపురం: జీడికల్ శ్రీ వీరాచల రామచంద్రస్వామి దేవస్థాన కమిటీ ఎట్టకేలకు నియామకం అయింది. ధర్మకర్తల మండలి చైర్మన్‌గా కళ్లెం గ్రామానికి చెందిన ఏలె నర్సింహులు అలియాస్ మూర్తిని ఎన్నుకున్నారు. 'దేవస్థాన కమిటీ లేకుండానే బ్రహ్మోత్సవాలు' శీర్షికన ఈ నెల 4న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు, ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక చొరవతో కమిటీని ఏర్పాటు చేశారు. సోమవారం దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్ పది మంది ధర్మకర్తలతో కూడిన ఉత్తర్వులు జారీ చేశారు. ఏలె నర్సింహులు అలియాస్ మూర్తి(కళ్లెం), మొటికె శ్రీశైలం (నాగారం), నర్ర శరబారెడ్డి (మాణిక్యాపురం), ఉడుగుల వెంకన్న(జీడికల్), కత్తుల శ్రీనివాసురెడ్డి(గుమ్మడవెల్లి), మంద శ్రీధర్‌రెడ్డి(లింగాలఘణపురం), కడకంచి లక్ష్మి(లింగాలఘణపురం), పసునూరి ఉపేందర్(వడిచర్ల), తుపాకుల వెంకటేష్(నెల్లుట్ల), అబ్బటి బాదిరెడ్డి(కొత్తపల్లి)ని నియమించారు. ఈ మేరకు వారికి సోమవారం రాత్రి దేవాలయ ఈఓ వంశీ ఆధ్వర్యాన నియామక పత్రాలు అందజేశారు. చైర్మన్‌గా ఏలె నర్సింహులును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు, జనగామ మార్కెట్ వైస్ చైర్మన్ శివకుమార్, కళ్లెం పీఏసీఎస్ చైర్మన్ ఉపేందర్, నాయకులు కీసర దిలీప్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ మోహన్, నాగేందర్, గణపతి తదితరులు పాల్గొన్నారు.



దేవస్థాన కమిటీకి నియామక పత్రాలు అందజేస్తున్న ఈఓ వంశీ

క్లుప్తంగా

వెంటాడిన మృత్యువు..

- పదేళ్ల క్రితం తప్పినా.. నేడు కబళించింది
- ట్రాక్టర్ బోల్తాపడి రైతు దుర్మరణం
- నేలపోగులలో ఘటన


అబ్బయ్య (ఫైల్)

లింగాలఘణపురం: ట్రాక్టర్ ప్రమాదం మృత్యువులా వెంటాడింది. పదేళ్ల క్రితం జరిగిన ప్రమాదంలో పొలం దున్నుతున్న ఓ రైతు ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో కాళ్లు విరిగి ప్రాణాపాయస్థితి నుంచి బయటపడ్డాడు. నేడు అదే ట్రాక్టర్ కాల్వలో బోల్తాపడడంతో అదే రైతు దుర్మరణం చెందాడు. ఈ ఘటన మండలంలోని నేలపోగులలో జరిగింది. పోలీసులు, గ్రామస్తు ల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మైల అబ్బయ్య(55) తన కున్న ఐదు ఎకరాల భూమి ని సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో సోమవారం పొలం దున్నేందుకు ట్రాక్టర్‌లో బయలుదేరాడు. మార్గమధ్యలో దేవాదుల కాల్వ ఒడ్డు నుంచి వెళ్తున్న క్రమంలో టూవీల్స్ బ్రేక్ లింక్ వేయకుండా ఒక వీల్ బ్రేక్ తొక్కడంతో ఒక్కసారిగా కుడివైపుకు తిరిగి కాల్వలో పడింది. దీంతో అబ్బయ్య ట్రాక్టర్ కింద పడి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. కాగా, పదేళ్ల క్రితం కూడా అబ్బయ్య తన పొలంలో ట్రాక్టర్ దున్నుతున్న క్రమంలో బురుదలో కూరుకుపోగా ఒక్కసారిగా ఎక్స్‌లేటర్ తొక్కడంతో తలకిందులై మీద పడగా కాళ్లు విరిగి ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. నేడు అదే మాదిరి ట్రాక్టర్‌తో పొలం దున్నేందుకు వెళ్తుండగా ప్రమాదం జరిగి దుర్మరణం చెందడంతో ట్రాక్టర్ రూపంలో మృత్యువు వెంటాడిందంటూ కుటుంబ సభ్యులు, బంధువులు రోదించారు. మృతుడికి భార్య, ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

చిరంజీవుడు..

- యువకుడి మరణం.. ఐదుగురికి ప్రాణదానం
- అవయవాలు దానం చేసిన కుటుంబీకులు


మహబూబాబాద్ అర్బన్: ఓ యువకుడు చనిపో తూ ఐదుగురికి ప్రాణ దానం చేశాడు. కిడ్నీలు, కళ్లు, లివర్ దానం చేసి భౌతికంగా లేకపోయినా తన అవయవాల రూపంలో బతికే ఉన్నాడు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లా కేంద్రంలోని ఎల్బీజీ నగర్ కాలనీకి చెందిన బొజ్జ భిక్షపతి, మంగమ్మ దంపతుల కుమారుడు వరుణ్ (23) సూర్యాపేట జిల్లా మోతే మండలంలో ఓ కోళ్లఫామ్‌లో సూపర్‌వైజర్, డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. పని నిమిత్తం ఈనెల 8వ తేదీన బైక్‌పై మోతే మండలం నుంచి కేశవాపురం వెళ్తున్న వరుణ్‌ను ఎదురుగా ఆటో ఢీకొనడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. వెంటనే సూర్యాపేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలపడంతో వెంటనే హైదరాబాద్ ఎల్బీనగర్‌లోని కామినేని ఆస్పత్రిలో చేర్పించగా బ్రెయిన్ డెడ్ అయింది. దీంతో వైద్యులు సూచన మేరకు కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు స్పందించి ఈ నెల 9వ తేదీన వరుణ్ రెండు కిడ్నీలు, రెండు కళ్లు, లివర్ దానం చేసి ఐదుగురి ప్రాణాలు కాపాడారు. దీనిపై వరుణ్‌తోపాటు కుటుంబ సభ్యులు పలువురికి ఆదర్శంగా నిలిచారని ప్రజలు అభినందించారు. నిరుపేదలైన వరుణ్ తల్లిదండ్రులను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవా లని పలువురు కోరుతున్నారు.

మాస్టర్‌ప్లాన్ -2041కు ఆమోదం

వరంగల్ అభివృద్ధికి ఇక మార్గం సుగమం

- మారనున్న గ్రేటర్ రూపురేఖలు
- ఫలించిన 53 ఏళ్ల కల

వరంగల్ అర్బన్ : వరంగల్ మాస్టర్ ప్లాన్–2041కు సోమవారం రాష్ట్ర సర్కారు ఆమోద ముద్ర వేసింది. దీంతో 53 సంవత్సరాల తర్వాత మహానగర పౌరుల నిరీక్షణకు ఫలితం లభించింది. కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా) రూపొందించిన బృహత్తర ప్రణాళికను అమల్లోకి తీసుకొచ్చిన 202 ఉత్తర్వులతో ఇక నుంచి ప్రణాళికప్రకారం అభివృద్ధికి మార్గం సుగమమైంది. ఒకటి, రెండు రోజుల్లో గెజిట్ వెలువడనుంది. నూతన మాస్టర్ ప్లాన్ ఆమోదంతో ఇక ఓరుగల్లు రూపురేఖలు మారిపోనున్నాయి. వరంగల్ మహానగరంతోపాటు 19 మండలాల పరిధిలోని 181 గ్రామాలు 'కుడా' పరిధిలోకి రానున్నాయి. ల్యాండ్ యూజ్, లేఅవుట్లు, ఎల్ఆర్ఎస్, భవన నిర్మాణాల అనుమతులకు అడ్డంకులు తొలగనున్నాయి. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంటున్న దరఖాస్తులకు మోక్షం లభించనుంది. భవిష్యత్‌లో జనాభా పెరుగదల దృష్టిలో ఉంచుకుని మాస్టర్ ప్లాన్ రూపొందించారు. ప్రభుత్వ, ప్రైవేట్ భూముల వినియోగంపై స్పష్టత రానుంది. వివిధ జోన్లలో మౌలిక వసతులు, రైలు, రోడ్డు నెట్‌వర్క్, రహదారుల విస్తరణ, అభివృద్ధి, నీటి వనరుల పరిరక్షణ, సద్వినియోగం కానున్నాయి. ఇండస్ట్రీయల్ జోన్ కారిడార్, టౌన్ షిప్‌లు, ల్యాండ్ పూలింగ్ విధానం, విద్యారంగం, పర్యాటకం, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యం లభించనుంది.


మాస్టర్ ప్లాన్ మ్యాప్

భారీ కసరత్తు తర్వాత..

టెక్స్‌టైల్ పార్కు, మామునూరు విమానాశ్రయం, ఇన్నర్, ఔటర్, రీజినల్ రింగ్ రోడ్లను దృష్టిలో ఉంచుకుని జోన్లను వర్గీకరించారు. ప్రస్తుతం, భవిష్యత్‌లో అభివృద్ధికి గాను విద్యారంగం, ఐటీ హబ్, ఎంఎంటీఎస్, నియో రైలు, టూరిజం సిటీ తదితర ప్రత్యేకతలతో రెండో ఆర్థిక రాజధాని తరహాలో మాస్టర్ ప్లాన్‌ను పరిగణనలోకి తీసుకున్నారు.

మిక్స్‌డ్ జోన్‌గా మహానగరం

వరంగల్ నగరాన్ని మిక్స్‌డ్ యూజ్ జోన్‌గా రూపకల్పన చేశారు. ఇండస్ట్రీయల్, రెసిడెన్షియల్ జోన్‌లో సైతం భవన నిర్మాణాలు జరుపుకునేందుకు అవకాశం కలుగుతోంది. కొత్త మాస్టర్ ప్లాన్‌ను మొత్తం 13 భూ వినియోగ జోన్లుగా రూపకల్పన చేశారు. ఇందులో 11 జోన్లను అభివృద్ధి నిర్మాణాలకు అనుకూలంగా విభజించారు. చెరువులు, కుంటలు, నాలా, అగ్రికల్చర్ జోన్లను అందులో వరంగల్ మహా నగరాన్ని మిక్స్‌డ్ జోన్‌గా పొందుపర్చారు. నిషేధిత రెండు జోన్లుగా వర్గీకరణ చేశారు. ఈ జోన్లలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టొద్దు. డెవలప్‌మెంట్ జోన్లు 11 ఉండగా, అందులో రెసిడెన్షియల్ యూజ్ జోన్, కమర్షియల్ జోన్, విలేజ్ ఎక్స్‌ప్యాన్షన్ జోన్, ఇండస్ట్రీయల్ యూజ్ జోన్, పబ్లిక్ అండ్ సెమీ పబ్లిక్ యూజ్ జోన్, ట్రాన్స్‌పోర్టేషన్ జోన్, పబ్లిక్ యూటిలిటీస్ జోన్, గ్రోత్ కారిడార్, హెరిటేజ్ జోన్లుగా విభజించారు.

ఇదీ స్వరూపం

- 1949లో తొలిసారి మాస్టర్ ప్లాన్, 1961లో రివైజ్డ్
- 1971లో విజన్ 1991 అవసరాలకు అనుగుణంగా రూపకల్పన చేశారు.
- 2013లో 'కుడా' విజన్–2030 పేరుతో 20లక్షల జనాభాను దృష్టిలో ఉంచుని రూపొందించారు.
- 2014 జనవరిలో ఆమోదం కోసం సర్కారుకు నివేదించగా, మార్పులు, చేర్పులకు ఆదేశం.
- 2017 మే14న ముసాయిదా విడుదల,120 సందేహాలు, అభ్యంతరాల స్వీకరణ.
- 2019 ఫిబ్రవరిలో అప్పటి మంత్రి కేటీఆర్ సమీక్ష, మళ్లీ సూచనలు.
- 2019 డిసెంబర్‌లో ప్రభుత్వానికి నివేదిక
- 2020 మార్చి 11న అప్పటి మంత్రి మాస్టర్ ప్లాన్‌కు ఆమోదం
- నాటి నుంచి గత కొద్ది నెలల వరకు సీఎం పేషీలో పెండింగ్.
- 2024 నవంబరు 18న నూతన మాస్టర్ ప్లాన్‌కు ప్రభుత్వం ఆమోదం

నెరవేరనున్న దశాబ్దాల కల..

గ్రేటర్ వరంగల్‌లో భూగర్భ డ్రెయినేజీ నిర్మాణానికి రూ.4,170 కోట్లు

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- మాట నిలబెట్టుకున్న సీఎం రేవంత్ రెడ్డి

వరంగల్ అర్బన్ : గ్రేటర్ వరంగల్ ప్రజల చిరకాల స్వప్నం నెరవేరనుంది. మూడు దశాబ్దాల నుంచి ఎదురుచూస్తున్న భూగర్భ డ్రెయినేజీ నిర్మాణ కల సాకారం కానుంది. అస్తవ్యస్త డ్రెయినేజీ వ్యవస్థ తీవ్ర ఇబ్బందులు పడుతున్న మహానగర ప్రజానీకానికి ఇది శుభవార్త. సుందరీకరణకు అడ్డంకిగా మారిన అండర్ గ్రౌండ్ సిస్టమ్ (యూజీడీ)కు ఎట్టకేలకే రూ.4,170 కోట్లు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ వెల్లడించారు. బల్దియా తొలిసారి 1996 నుంచి అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పథకం అమలు చేసేందుకు ప్రణాళికలు చేపట్టింది. నాటి నుంచి గత ఐదు నెలల క్రితం వరకు ఎన్నో కన్సల్టెన్సీలు డీపీఆర్‌ల రూపకల్పన చేశాయి. ఎన్నిక ల హామీల్లో భాగంగా సుమారు ఏడాది క్రితం భూగర్భ డ్రెయినేజీ నిర్మాణానికి ఇచ్చిన మాటను సీఎం రేవంత్ రెడ్డి నిలబెట్టుకున్నారు. ఈ ఏడాది జూన్ 29న సీఎం రేవంత్ రెడ్డి హనుమకొండ ఐడీఓసీలో జరిగిన సమీక్షలో జీడబ్ల్యూఎంసీ పరిధిలో వివిధ మౌలిక సదుపాయాల పనులకు సంబంధించిన డీపీఆర్ సిద్ధం చేయాలని కమిషనర్‌ను ఆదేశించారు. శుభ్ కన్సల్టెంట్స్ అండ్ టెక్నోక్రాట్స్(ఎల్ఎల్‌పీ) డీపీఆర్‌ను పబ్లిక్ హెల్త్ ఇన్‌చీఫ్ నివేదించారు. దీంతో ఎట్టకేలకే నిధులు మంజూరుకు లైన్ క్లియర్ అయింది. యూజీడీ కోసం వరంగల్ నగరానికి నిధుల కేటాయించడంపై నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి.. సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

మూడుదశల్లో ప్లాన్..

మూడు దశల్లో మౌలిక సదుపాయాల మాస్టర్ ప్లాన్‌లు చేపట్టనున్నారు. సదుపాయాల ప్రాధాన్య నివేదికలు, బల్దియా కమిషనర్, కన్సల్టెన్సీ సూచనలు పరిగణనలోకి తీసుకోనున్నారు.

- అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ
- తుపాన్ నీటిపారుదల
- నీటి సరఫరా వ్యవస్థలు
- నీటి వనరుల పునరుజ్జీవనం
- జలాశయ నిర్వహణ ప్రణాళిక
- బ్లూ–గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రూపకల్పన
- పవర్, టెలికాం, కేబుల్, ఇంటర్నెట్ మొదలైన సేవలు

నిర్మాణం ఇలా...

150–300 ఎంఎం దయా పైపులైన్లు, ఆర్‌సీసీ మెయిన్ పైపులైన్లు 350 నుంచి 1,600, మ్యాన్ హోల్స్, చాంబర్లు, మురుగునీటి శుద్ధికరణ జోన్లు.


వరంగల్ ఎల్‌బీనగర్‌లోని ఓపెన్ డ్రెయినేజీ

- నిధులు ఇలా.. మొత్తం రూ.4,170కోట్లు
- ఫేజ్–1కు రూ.3,087కోట్లు
- ఫేజ్–2కు రూ.597కోట్లు
- ఫేజ్–3కు రూ.486కోట్లు

ప్రాజెక్టు పూర్తయితే ప్రయోజనాలు..

అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ ద్వారా భూగర్భ జలాలు కాలుషితం కాకుండా రక్షించే వీలుంటుంది. నిర్ణీత గడువులోపు పూర్తయితే గ్రేటర్ వరంగల్‌కు కొంత ఆదాయం సమకూరనుంది. ఇళ్ల నుంచి సెప్టిక్ , మురుగునీటి కనెక్షన్లను భూగర్భ డ్రెయినేజీకి అనుసంధానం చేస్తారు. దీనివల్ల బల్దియాకు ఆరునెలలకు ఒకసారి పన్ను వస్తుంది. ఇది ఇలా ఉండగా, ఇళ్ల నుంచి సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలు కాల్వల్లోకి వదలడం వల్ల వ్యాధులు ప్రబలుతున్నాయి. దీంతోపాటు తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు అధికమవుతున్నాయి. యూజీడీ అందుబాటులోకి వస్తే ఇళ్ల నుంచి విడుదలయ్యే మురుగునీటిని ఎస్టీపీ ప్లాంట్ల ద్వారా శుద్ధి చేసి, తిరిగి దిగువన విడుదల చేసేందుకు వీలుంటుంది.

ఇదీ లెక్క..

- మహా నగర జనాభా 10.60లక్షలు(అంచనా)
- విస్తీర్ణం 408 చదరపు కిలోమీటర్లు
- రోజు ట్రై సిటీ నుంచి మురుగునీరు 135 మిలియన్ మీటర్ ఫర్ డే(ఎంఎల్‌డీలు)
- పక్కా మురుగు కాల్వలు 2,795
- కచ్చా కాలువలు 1,602 కిలోమీటర్లు
- స్మార్ట్ వాటర్ డ్రెయినేజీల్లో 35 కిలోమీటర్లు
- మొత్తం డ్రెయినేజీ వ్యవస్థ 4,397 చదరపు కిలోమీటర్లు
- ప్రాజెక్టు అంచనా రూ.4,170కోట్లు

నేటినుంచి ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల బంద్

- పరీక్షల బహిష్కరణ కూడా..
- కేయూ వీసీకి నోటీసు అందజేత
- ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో ఈ నిర్ణయం



వీసీ ప్రతాప్‌రెడ్డికి నోటీసును అందజేస్తున్న అసోసియేషన్ బాధ్యులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలోని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు నేటి (ఈనెల 19)నుంచి నిరవధికంగా బంద్ చేయనున్నారు. ఈ మేరకు ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ బాధ్యులు సోమవారం కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రతాప్‌రెడ్డికి నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ బాధ్యులు మాట్లాడుతూ రెండేళ్ల నుంచి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడం లేదని, దీంతో తాము ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఈ విషయాన్ని మంత్రులు, సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోవడం లేదన్నారు. అలాగే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలవాలని పలుమార్లు ప్రయత్నించినా కనీసం సమయం కూడా ఇవ్వలేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో 90శాతం కళాశాలలు నాలుగు, ఐదు నెలల నుంచి అధ్యాపకులు, ఇతర సిబ్బందికి వేతనాలు కూడా ఇవ్వలేని పరిస్థితులు ఉన్నాయన్నారు. అయినా ఇంతకాలం సుమారు 7లక్షలమంది డిగ్రీ, పీజీ విద్యార్థులు నష్టపోవద్దనే కారణంతో తరగతులు నిర్వహించామన్నారు. గత నెలలో 14వతేదీ నుంచి కూడా కళాశాలలు బంద్ చేయగా అదే నెల 17న విద్యాశాఖ సెక్రటరీ బుర్రా వెంకటేశం తమను పిలిచి మాట్లాడారని, వారం రోజులలోపే విడుదల చేస్తామని హామీ ఇవ్వడంతో బంద్ విరమించామన్నారు. అయితే నేటికీ చెల్లించలేదన్నారు. దీంతో అనివార్య పరిస్థితుల్లో ఈనెల 19వతేదీ నుంచి కళాశాలల నిరవధిక బంద్‌కు నిర్ణయించామన్నారు. ఫీజురీయింబర్స్‌మెంట్ చెల్లించే వరకూ కళాశాలలను తెరవబోమని స్పష్టం చేశారు. అలాగే, కేయూ పరిధిలో ఈనెల 26 నుంచి జరిగే డిగ్రీ కోర్సుల మొదటి, మూడో, ఐదో సెమిస్టర్ పరీక్షలు కూడా బహిష్కరించనున్నామని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమ సమస్యను పరిష్కరించాలని వీసీ ప్రతాప్‌రెడ్డికి విన్నవించారు. వీసీకి నోటీసు అందజేసిన వారిలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.రవీంద్రనాథ్, బాధ్యులు జి.వేణుమాధవ్, గోలి వెంకట్, ఎం.శ్రీనివాస్, కృష్ణమోహన్ ఉన్నారు.

కాజీపేట రైల్వే డివిజన్‌కు అడుగులు..

- సరిహద్దు ఏర్పాట్లకు ప్రతిపాదనలు
- నెరవేరనున్న చిరకాల స్వప్నం


కాజీపేట రైల్వే జంక్షన్

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ రైల్వే డివిజన్ ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. ఈ మేరకు రైల్వే వర్గాల ద్వారా సికింద్రాబాద్ రైల్వే అధికారులకు సోమవారం రాత్రి సమాచారం అందినట్లు తెలిసింది. రైల్వే మంత్రిత్వశాఖ, రైల్వే బోర్డు అధికారులు కాజీపేట డివిజన్ ఏర్పాటుకు సంబంధించిన భౌగోళిక సరిహద్దులు, భూమి విస్తీర్ణం, రైల్వే ట్రాక్ దూరం, రైల్వే స్టేషన్‌ల సంఖ్య, రైల్వే వర్క్‌షాప్‌లు, పరిపాలన యంత్రాంగం, రైల్వే పోలీస్‌స్టేషన్‌ల పరిధి, ప్రయాణికుల అప్ అండ్ డౌన్‌ల సంఖ్య, రోజువారీ ఆదాయం, రైల్వే సెక్షన్ రూట్‌లు, రైల్వే కార్మికుల సంఖ్య తదితర సమాచారం సేకరించాలని దక్షిణ మధ్య రైల్వే జోనల్ అధికార వర్గాలకు పలు సూచనలు చేసినట్లు సమాచారం. 1904లో నిజాం కాలంలో ఏర్పాటైన కాజీపేట రైల్వే స్టేషన్ దినాదినాభివృద్ధి చెంది దేశ ఉత్తర, దక్షిణ ప్రాంతాలకు గేట్‌వేగా ఉంటూ భారతీయ రైల్వేలో ప్రత్యేక స్టేషన్‌గా సంతరించుకుంది. అలాంటి కాజీపేట జంక్షన్‌ను రైల్వే డివిజన్ కేంద్రంగా చేయాలని ఈ ప్రాంత ప్రజలు, రైల్వే కార్మికుల దశాబ్దాల కల. ఎన్నో ప్రభుత్వాలు వచ్చాయి. అయినా ఫలితం లేకుండా పోయింది. ఎట్టకేలకు కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటుకు ప్రతిపాదనలకు సంబంధించిన సమాచారం తెలియడంతో ప్రజలు, రైల్వే కార్మికుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఇప్పటికే కాజీపేట రైల్వే వ్యాగన్ సీటీహెచ్ షెడ్ నిర్మాణమవుతుండగా రైల్వే కోచ్ ఫ్యాక్టరీ మంజూరు కావడం, ఇప్పుడు కాజీపేట డివిజన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు, శ్రీకారం చుట్టడంతో ఈ ప్రాంతం అభివృద్ధితో పాటు, చిన్న పరిశ్రమలు ఏర్పాటుతో నిరుద్యోగం తగ్గే అవకాశం ఉందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలి

- పాస్ రాష్ట్ర అధ్యక్షుడు మల్లేశ్వర్


మాట్లాడుతున్న పాస్ రాష్ట్ర అధ్యక్షుడు సంగనిమల్లేశ్వర్, ఇతర నాయకులు

కేయూ క్యాంపస్: పూలే ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీలోని దూర విద్యాకేంద్రం జర్నలిజం విభాగం సెమినార్‌హాల్ లోఈనెల 19న ఉదయం 10గంటలకు 'కులగణన– సామాజిక న్యాయం' అనే అంశంపై రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించనున్నామని, ఈసదస్సును విజయవంతం చేయాలని పాస్‌రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సంగనిమల్లేశ్వర్ కోరారు. సోమవారం కేయూలోని దూరవిద్య కేంద్రం జర్నలిజం విభాగంలో పూలే ఆశయ సాధన సమితి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా తెలంగాణ విద్యా కమిషన్ సభ్యుడు పి.ఎల్. విశ్వేశ్వర్‌రావు, విశిష్ట అతిథిగా తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి, ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్,సామాజిక ఉద్యమకారుడు ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ,ఇఫ్లూ ఆచార్యుడు డాక్టర్ కె. రాజారామ్ పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. ఈ సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సమితి ఉమ్మడి వరంగల్ జిల్లాప్రధాన కార్యదర్శి డాక్టర్ నల్లానిశ్రీనివాస్, పాస్ జిల్లా నాయకులు డాక్టర్ డి. శ్రీకాంత్‌యాదవ్, పి. వెంకటేశ్వర్లు, డాక్టర్ మోటె చిరంజీవి, ఈర్ల సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు కొత్త మిర్చి


కొత్త మిర్చికి పూజలు చేస్తున్న వ్యాపారులు

- క్వింటాల్‌కు ధర రూ.14వేలు

వరంగల్: ఏనుమాములలోని వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం ఈసీజన్‌లో కొత్త మిర్చి తేజ రకం పంటను రైతులు విక్రయానికి తీసుకొచ్చారు. కాగా, కొత్తమిర్చికి వ్యాపారులు ప్రత్యేక పూజలు నిర్వహించి కొనుగోళ్లు చేశారు. తేజ రకం కొత్త మిర్చి 79 బస్తాలు రావడంతో వ్యాపారులు క్వింటాల్‌కు రూ.14వేలతో కొనుగోలు చేశారు. కోల్డ్ స్టోరేజీలోని తేజ రకం మిర్చి క్వింటాల్‌కు గరిష్టంగా రూ.15,500, తేజరకం పాత మిర్చికి రూ. 12వేలు పలికింది. పత్తి 3500 బస్తాలు రాగా గరిష్టంగా రూ.6,750 ధర పలికిందని మార్కెట్ వర్గాలు తెలిపాయి.

అభివృద్ధిపై ఆధారాలతో చర్చకు సిద్ధం


- బీఆర్ఎస్ నాయకులు సిద్ధమా?
- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని సవాల్


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ కావ్య, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ సారయ్య, తదితరులు

హన్మకొండ చౌరస్తా : పదేళ్లలో చేయని అభివృద్ధిని పది నెలల్లో చేస్తుంటే ఓర్వలేక నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని, , వరంగల్ అభివృద్ధిపై ఆధారాలతో తాను చర్చకు సిద్ధం.., బీఆర్ఎస్ సిద్ధమా అని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సవాల్ విసిరారు. హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కాళోజీ కళాక్షేత్రం, భద్రకాళి మాడ వీధులు, నయీంనగర్ నాలా లాంటి అనేక అభివృద్ధి పనులు మేము చేస్తే , బీఆర్ఎస్ నాయకులు తాము చేశామని సిగ్గులేకుండా చెబుతున్నారని ధ్వజమెత్తారు. మామునూరు ఎయిర్‌పోర్టును గత ప్రభుత్వం ఎన్నికల స్టంట్‌గా వాడుకుంటే నేటి కాంగ్రెస్ సర్కారు రూ.205 కోట్ల నిధులు విడుదల చేస్తూ జీఓ జారీ చేసిందన్నారు. వరంగల్‌ను రెండో రాజధానిగా తీర్చిదిద్దేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ, మాస్టర్‌ప్లాన్ అమలుకు నిధులు కేటాయించారన్నారు. నేడు (19వ తేదీన) ఆర్ట్స్ కాలేజీ మైదానంలో తలపెట్టిన ఇందిరాశక్తి సభను విజయవంతం చేయాలని ప్రజలను కోరారు. ఎంపీ కావ్య, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ సారయ్య, డీసీసీ వరంగల్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాసరావు, ఈవీ శ్రీనివాసరావు, టూరిజం సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, దొమ్మాటి సాంబయ్య, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం హనుమకొండ అశోక జంక్షన్‌లో మామునూరు ఎయిర్‌పోర్ట్, పలు అభివృద్ధి పథకాలకు నిధులు కేటాయించడంపై సీఎం రేవంత్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బాణసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం

- కాంగ్రెస్ సీనియర్ నేత వి. హనుమంతరావు


కళాక్షేత్రాన్ని పరిశీలిస్తున్న వీహెచ్

హన్మకొండ చౌరస్తా: త్వరలో జరగనున్న మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ఆ పార్టీ సీనియర్ నాయకుడు వి. హనుమంతరావు ధీమా వ్యక్తం చేశారు. సోమవారం హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ కాలేజీ మైదానంలో జరగనున్న ఇందిరా మహిళా శక్తి సభ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి ఇందిరాగాంధీ హయాం నుంచి బడుగు, బలహీన వర్గాలే అండగా నిలిచాయన్నారు. ప్రధాని మోదీ చెప్పిన ఏ ఒక్క పనీ చేయలేదన్నారు. కనీసం జనాభా ప్రాతిపదికన మంత్రి పదవులు ఇవ్వలేదన్నారు. బీజేపీ సర్కారు వెంటనే కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. తప్పు చేసిన వారెవరైనా శిక్ష అనుభవించాల్సిందేనని, కొందరు అధికారం కోసమే కాంగ్రెస్ పార్టీలోకి వస్తున్నారని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అంతకుముందు ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, 'కుడా' చైర్మన్ వెంకట్రాంరెడ్డితో కలిసి హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రాన్ని పరిశీలించారు.


కేఎంటీపీలో పీహెచ్‌సీ మంజూరు

- ఉత్తర్వులు జారీ చేసిన వైద్యారోగ్యశాఖ

గీసుకొండ: వరంగల్ జిల్లాలోని గీసుకొండ–సంగెం మండలాల పరిధిలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు(కేఎంటీపీ)లో కార్మికులు, పని చేసే వారి ఆరోగ్య అవసరాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) మంజూరు చేసింది. ఈ మేరకు సోమవారం వైద్యారోగ్యశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పార్కు కోసం భూములు ఇచ్చిన నిర్వాసితుల కోసం ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసింది. టౌన్ షిప్ తరహాలో సకల సౌకర్యాలు కల్పించడానికి ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా టౌన్‌షిప్‌లో ఉండే వారి కోసం పీహెచ్‌సీని మంజూరు చేయడంతో భూములు ఇచ్చిన రైతు కుటుంబాలకు ఆరోగ్య పరంగా మేలు జరిగే అవకాశం ఉంది.

ఏం చేశారని విజయోత్సవ సభ

- ప్రజలకు క్షమాపణ సభగా నిర్వహించండి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, చిత్రంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తదితరులు

నయీంనగర్: మహిళలకు రూ. 2,500, తులం బంగా రం, కల్యాణలక్ష్మి ఇవ్వకుండా కాంగ్రెస్ విజయోత్సవ సభ జరపడానికి సిగ్గు లేదా అని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రశ్నించారు. అబద్దపు వాగ్దానాలు, మోసంతో అధికారంలోకి వచ్చారన్నారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ డ్వాక్రా సంఘాలను శ్రీనిధి ద్వారా దేశంలో నంబర్ వన్ చేస్తే.. కాంగ్రెస్ పాలకులు.. మహిళలకు చేసింది గుండు సున్నా అన్నారు. కాంగ్రెస్ బూటకపు హామీలకు రైతులు, మహిళలు ఆశపడ్డారని, వారి ఆశలు నీరుగారాయన్నారు. కేసీఆర్ పాలనలో మిగులు కరెంట్ ఉంటే కాంగ్రెస్ పాలనలో విద్యుత్ కష్టాలు, సంక్షోభం మళ్లీ మొదలైందన్నారు. వరంగల్ ఇన్‌చార్జ్ మంత్రి పిట్టలదొర, తుపాకీ రాముడని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం వల్లే తెలంగాణలో అధిక వరి దిగుబడి సాధ్యమైందన్నారు. లంబాడీలు తుపాకులకు భయపడరని, లగిచర్ల రైతులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. చేనేత బీమా, వరంగల్ బస్టాండ్ గురించి అడగలేని మంత్రి వరంగల్‌లో ఉన్నారన్నారు. తెలంగాణ సమాజాన్ని మోసం చేసినందుకు, ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చనందుకుగాను వరంగల్‌లో జరిగే కార్యక్రమాన్ని క్షమాపణ సభగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. 600 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, రైతు రుణమాఫీ, పెట్టుబడి సాయం, బీమా చేయనందుకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు క్షమాపణ చెప్పాలన్నారు. రైతులు సభకు రారని మహిళా సభ నిర్వహిస్తున్నారని ఎద్దేవా చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రాజయ్య, ధర్మారెడ్డి, వెంకటరమణారెడ్డి, ఎన్.నరేందర్, శంకర్ నాయక్, కుడా మాజీ చైర్మన్‌లు యాదవరెడ్డి, సుందర్‌రాజ్ యాదవ్ పాల్గొన్నారు.